క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని సీవీవీ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత రూ.6.1 కోట్ల చెక్కును ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అందించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు రాజుపాళెంకు ఎమ్మెల్యే రాచమల్లు రాక

రాజుపాళెం : రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం జరగబోవు మూడో విడత ఆసరా సంబరాలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రానున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

కలసపాడు : కలసపాడులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చెరుకూరి రవికుమార్ సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు ఎస్‌ఐ నాగమురళి చేతులమీదుగా పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగమురళి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడారు. పోరుమామిళ్ళ, కలసపాడు, బి.కోడూరు, కాశినాయన మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించేందుకు చెరుకూరి రవికుమార్ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవిద్య ఐఏఎస్ అకాడమిలో మైనారిటీ విద్యార్థులకు సచివాలయ, గ్రూప్–2, నీట్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమి కో–ఆర్డినేటర్ గుణవతి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోచింగ్‌సెంటర్‌ను సందర్శించాలని, సెల్ నంబర్ 9494470087కు సంప్రదించాలని కోరారు.

14న దళిత గర్జన

బద్వేలు అర్బన్ : ఈ నెల 14న ఏలూరులో మాలమహాసేన ఆధ్వర్యంలో దళిత గర్జన మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితుల ఐక్యత, అభివృద్ధే అజెండాగా ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని, ఈ సభకు పెద్ద ఎత్తున దళితులు తరలిరావాలని కోరారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మైదుకూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇందిరమ్మ కాలనీలో ఏడు రోజులపాటు నిర్వహించిన స్పెషల్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. పారిశుధ్యం పనులు, ఆరోగ్య సర్వే నిర్వహించారు. కాలనీ వాసులకు విష జ్వరాలు, కరోనాపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ మంజూరు చేసిన సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ పి.నారాయణరెడ్డి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దాతలు తమవంతుగా ముందుకు వచ్చి నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ నెల్లూరు జోనల్ మేనేజర్ ఎల్‌జీఎస్ మాధవన్ తెలిపారు. శుక్రవారం కడప రైల్వే గూడ్స్ షెడ్ ఆవరణలో కార్మికులు, హమాలీలకు ఇన్‌ఫ్యాక్ట్ గురు ఫౌండేషన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీల సంయుక్తాధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని మాధవన్‌తోపాటు కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డి ప్రారంభించారు. రిమ్స్ వైద్యులు 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాగర్‌రెడ్డి, లహరిక, నందారెడ్డి, క్యాంపు కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్, వేర్ హౌసింగ్ ఆఫీసర్ జీఎస్ సతీష్, కోరమాండల్ ప్రతినిధి నగేష్ పాల్గొన్నారు.

అచ్చన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పశు సంవర్ధక శాఖ డీడీ అచ్చన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు అఖిలపక్ష నాయకులు వినతిపత్రమిచ్చారు. అచ్చన్న హత్య వెనకాల ఉన్నత, రాష్ట్ర స్థాయి అధికారులు హస్తం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అచ్చన్న మృతిపై నిష్పక్షపాతంగా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనికోరారు.

మహిళల సంక్షేమమే సీఎం లక్ష్యం

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


మెగా చెక్కును డ్వాక్రా సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే

ఖాజీపేట : కుటుంబం అభివృద్ధి చెందాలంటే మహిళదే ప్రధాన పాత్ర అందుకే మహిళల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేటలోని జీఏ కల్యాణ మండపంలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్క మైదుకూరు నియోజకవర్గంకు మూడు విడతలకు గాను 3,602 సంఘాలకు రూ.80,49,64,663 వచ్చిందన్నారు. ఒక్క ఖాజీపేట మండలానికి 902 సంఘాలకు గాను రూ.24,94,50,525 వచ్చిందన్నారు. మహిళలు ఈ డబ్బుతో తమ కుటుంబంను ఉన్నతికి చేర్చుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. ఒకప్పుడు పాఠశాలలు కనీస సౌకర్యాలు లేక అధ్వానంగా ఉండేవన్నారు. నాడు–నేడుతో చక్కటి పాఠశాలలు మన కళ్ళ ముందు కనిపిస్తున్నాయని అన్నారు. విద్యార్థులకు చక్కటి పౌష్టికాహారం సీఎం అందిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సేస్తామని మోసం చేసిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. సీఎంగా చంద్రబాబు వస్తే పథకాలను ఆపేస్తారని అందుకే మనం మళ్లీ సీఎంగా జగన్ గెలిపించుకోవాలన్నారు. ఒక్క మహిళల సంక్షేమమే కాకుండా రైతుల కోసం రూ.13,500 ప్రతి ఏటా రైతులకు అందిస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మహిళలకు మెగా చెక్కును అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి ఏపీ ఐడీసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఖాజీపేట మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, బుజ్జి, చంద్రశేఖర్ ఏపీఎం శైలజా తోపాటు డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం


శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమంలో దేవతా మూర్తులు


పట్టాభిషేకంలో సీతారాముల ఉత్సవ మూర్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఘనంగా శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివారికి విశేష పూజాకార్యక్రమాలను చేసి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీసీతారామ చంద్ర స్వామి పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిరాముడి సన్నిధిలో అధికారులు

స్థానిక పట్టాభిరామ మండి కాంప్లెక్స్ ఆవరణలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. అధికారులకు మండి మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రొద్దుటూరు 1 సర్కిల్ వాణిజ్య పన్నుల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జీఎస్టీ అధికారులు గంగన్న, గంగాప్రసాద్, ఏఈఓ గోవిందు, ఓఎస్ షేక్‌షా, మండి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రోషన్ బాబా, కార్యదర్శి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కన్నుల పండువగా పట్టాభిషేకం

స్థానిక ఆత్మారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి సీతారాముల పట్టాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు


తనిఖీలలో పాల్గొన్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కడప అర్బన్ : జిల్లాలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు ఇన్‌స్పెక్టర్స్ టి. రెడ్డెప్ప, పి. రామకృష్ణ, ఏఈఈ కె. విజయకిషోర్, వి.అశోక్‌కుమార్ వివిధ బృందాలుగా ఏర్పడి ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని వివిధ ఆశ్రమాలు, నిలయాలలో శుక్రవారం తనిఖీలు చేశారు. చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లెలోని ఆశా నిలయం(బాలికలు), ఆశా నిలయం(బాలురు), కొండాయపల్లిలోని స్పెషలైజ్‌డ్ అడాప్షన్ ఏజెన్సీ, కడప కేంద్రకారాగారం సమీపంలోని మా అమ్మ ఒడి, అక్కాయపల్లిలోని రీజనల్ చిల్డ్రన్ హోంలలో ఈ తనిఖీలను చేపట్టారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు అక్కడి వసతులు, భోజన, వైద్య సదుపాయాలు, విద్యార్థుల హాజరు, రక్షణ, నిర్వహణ, రికార్డులను పరిశీలించి తగిన నివేదికను తయారు చేశారు. సదరు నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామని అధికారులు తెలియజేశారు.

నిరుద్యోగ యువత అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువత తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లోగల జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ నిరుద్యోగ యువత మొదటి తాము చేసేది చిన్న ఉద్యోగమైనా నిర్లక్ష్యంగా ఉండకుండా కష్టపడి పనిచేయాలన్నారు.అనంతరం ఫ్లిప్‌కార్ట్, అలీ డిక్సన్, సాక్షి మీడియా గ్రూపు ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు, కంపెనీల ప్రతినిధులు వీవీ నారాయణ, జీవీ సుబ్బరాయడు, టి.నాగయ్య, సాక్షి ఆర్‌ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ప్రొద్దుటూరును చేద్దాం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు : అందరం కలసి స్వచ్ఛ ప్రొద్దుటూరుగా చేద్దామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పిలుపునిచ్చారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛ మషాల్ మార్చ్‌లో భాగంగా ప్రొద్దుటూరును పచ్చగా, స్వచ్ఛంగా ఉంచుకుంటామని డ్వాక్రా మహిళలతో కలసి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మీ ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, మెప్మా టీఈ కెజియా జాస్లిన్, సీఓలు, పారిశుద్ధ్య అధికారులు, డ్వాక్రా మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్ విద్యా విధానం భేష్

కడప కల్చరల్: రామకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యా విధానం ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం రిమ్స్ సమీపంలోని రామకృష్ణ మిషన్ వివేకానందనగర్ హైస్కూలు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ మిషన్ పాఠశాలలన్నీ సేవాభావంతో నిర్వహిస్తున్నారని, ప్రతి విద్యార్థి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎంసీ జయలక్ష్మి పాఠశాల ప్రగతి నివేదికను సమర్పించారు. మిషన్ కార్యదర్శి స్వామి సన్నివాసానంద మిషన్ కార్యక్రమాలు, పాఠశాల నిర్వహణ గురించి వివరించారు. మిషన్ అధ్యక్షులు స్వామి భీతిహరానంద మాట్లాడుతూ మిషన్ పూర్తి స్థాయిలో సేవాభావంతో నడుస్తోందని, ప్రపంచ వ్యాప్తంగా 200 రామకృష్ణ మఠాలు, మిషన్లు, 1500 మంది సాధు సన్యాసులతో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. వైవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, క్రీడా మండలి కార్యదర్శి డాక్టర్ రామసుబ్బారెడ్డి మాట్లాడారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

శిల్పారామానికి కొత్త బోట్లు


నూతన బోట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర శిల్పారామాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామ్‌సుందర్ రెడ్డి

కడప కల్చరల్: కడప శిల్పారామం మరిన్ని హంగులు సంతరించుకుంటోంది. నీటి కొలను ద్వారా వేసవిలో ప్రజలకు మరింత ఆహ్లాదం చేకూర్చాలని దానికి మరిన్ని హంగులు చేర్చారు. ఇప్పటికే ఏడు పెడల్ బోట్లు ఉండగా, ప్రస్తుతం మరో రెండు పెడల్ బోట్లు తెప్పించారు. శుక్రవారం వాటిని రాష్ట్ర శిల్పారామాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత ఆయన శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డితో కలిసి బోటు షికారు చేసి నాణ్యతను పరిశీలించారు. పాత బోట్లకు ఒక్కొక్కరికి రూ. 30 చార్జి ఉండగా, కొత్త వాటిలో ఒకరు వెళ్లే సింగిల్ బోటుకు రూ. 60, ఇద్దరు వెళ్ల గలిగే బోటుకు రూ. 120 చార్జీ నిర్ణయించారు. వేసవిలో బోటు షికారుకు మంచి డిమాండ్ ఉంటుందన్న ఆలోచనతో నిర్వాహకులు ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సీఈఓ శ్యామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ శిల్పారామంలో సందర్శకులకు మరింత ఆహ్లాదం చేకూర్చేందుకు మరిన్ని ఆకర్షణలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆ ప్రాంతమంతా కొత్తదనంతో నింపేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని, పచ్చదనాన్ని పెంచేందుకు టెండర్లు కూడా పిలిచామన్నారు. వేసవిలో సందర్శకులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడంలో భాగంగానే పచ్చదనాన్ని పెంచుతున్నట్లు తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: జై భీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో రూపొందించిన అంబేద్కర్ జయంతి వారోత్సవాల పోస్టర్లను ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఆవిష్కరించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జై భీమ్ మాల మహాసేన ప్రతినిధులు కలిసి దళితుల సంక్షేమం కోసం తాము చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

ద్విచక్రవాహనం కాల్చివేత

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని కాల్చివేశారు. చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి తన ఇంటి ముందు గురువారం రాత్రి తన బైక్‌ను పార్క్ చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

మరో సంఘటనలో..ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీహరి డిగ్రీ కళాశాల సమీపంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో తన ద్విచక్రవాహనాన్ని తానే కాల్చుకున్నాడని సమాచారం. ఆ సంఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యతో పాటు సమాజంపై బాధ్యత అవసరం

వైవీయూ : విద్యార్థులకు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను పెంచేలా జాతీయ సేవాపథకం పనిచేస్తోందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో నగర పరిధిలోని శివానందపురంలో వారంరోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ముగింపు సమావేశం శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వారంరోజుల పాటు ప్రజలతో మమేకమై, వారిని చైతన్యవంతం చేయడంలో వలంటీర్లు విజయవంతమయ్యారన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి , ఎన్ఎస్ఎస్ పీఓ డా. వై. సావిత్రి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవిశేకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలూరుపాడులో ముగిసిన క్యాంపు

పెండ్లిమర్రి మండలం వేలూరుపాడు, శివాజీనగర్ గ్రామాల్లో వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ 7, 8 ఆధ్వర్యంలో మార్చి 25 నుంచి 31 వరకు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా. టి. చంద్రశేఖర్‌లు క్యాంపులో నిర్వహించిన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

పదేళ్ల సమస్యకు త్వరలో పరిష్కారం


కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, కమిషనర్ వెంకటరమణయ్య

ప్రొద్దుటూరు : పట్టణంలో 11వ వార్డు పరిధిలోని పదేళ్ల పారిశుధ్య సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. కమిషనర్ వెంకటరమణయ్యతో కలసి ఆయన శుక్రవారం 11వ వార్డు పరిధిలోని దొరసానిపల్లె డ్రైనేజీ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ప్రజల సౌకర్యార్థం కోసం కాలువను నిర్మించినా పదేళ్లుగా పూడికలు తీయలేదన్నారు. కాలువకు ఇరువైపులా ఆక్రమణలు చేపట్టడంతో కాలువలో పూడికను తీయడానికి వీలు లేకుండా పోయిందని తెలిపారు. దీంతో డ్రైనేజీ వ్యర్థాలు పేరుకుపోయిన కారణంగా మురికి నీరు ముందుకు సాగడం లేదన్నారు. దీంతో దుర్వాసన వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాలుగు రోజుల్లో యంత్రాలను ఏర్పాటు చేసి కాలువలోని పూడికను తీయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వినోద్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బండలాగుడు పోటీలు


మొదటి స్థానంలో నిలిచిన చాటపల్లె ఎద్దు

మైదుకూరు/చాపాడు : చాపాడు మండల పరిధిలోని గుంతచియ్యాపాడు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సీనియర్ ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలుగా చౌటపల్లి మార్తల చంద్రఓబుళరెడ్డి ఎద్దులు 3125 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.లక్ష కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా బిల్లాలపురం భుమ్మ గోవర్ధన్‌రెడ్డి ఎద్దులు 3056 అడుగులు లాగి రూ.80వేలు, రంగారెడ్డి జిల్లా కొత్తకోట డాక్టర్ గురునాథ్ ఎద్దులు 3042 అడుగులు లాగి మూడో బహుమతి రూ.60వేలు, అనంతపురం జిల్లా ఉరవకొండ మహమూద్ అలీ ఎద్దులు 2895 అడుగులు లాగి 4వ బహుమతి రూ.40వేలు, బాలుగారిపల్లె ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2784 అడుగులు లాగి 5వ బహుమతి రూ.30వేలు, నంద్యాల జిల్లా గోటిక రవితేశ్వరరెడ్డి ఎద్దు 2582 అడుగులు లాగి 6వ బహుమతి రూ.20వేలు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కాత్యాయని కన్‌స్ట్రక్షన్ ఎండీ రమణారెడ్డి, ఎంపీటీసీ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేష్, చియ్యపాడు సర్పంచ్ శివప్రసాద్ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో మైదుకూరు ఎద్దు ఫస్ట్


మొదటి స్థానంలో నిలిచిన మైదుకూరు ఎద్దు

రాజుపాళెం : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన న్యూ కేటగిరి బండలాగుడు పోటీల్లో మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేశ్ యాదవ్ ఎద్దులు 4172 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. రాజుపాళెం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో పది జతల ఎద్దు పాల్గొన్నాయి. రెండో స్థానంలో మైదుకూరు కుర్రా వెంకటేశ్ యాదవ్, గోసులవారిపల్లె వెంకటరమణారెడ్డి ఎద్దు, మూడో స్థానంలో ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్ల గురివిరెడ్డి ఎద్దు, 4వ స్థానంలో మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లెకు చెందిన మూలె ప్రసాద్ రెడ్డి ఎద్దు, 5వ స్థానంలో పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లె నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి ఎద్దు, 6వ స్థానంలో నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం తుడమలదిన్నె పేరెడ్డి సుబ్బారెడ్డి ఎద్దు నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు రాజుపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందించారు. రాజుపాళెం ఇన్‌చార్జి ఎస్ఐ మంజునాథ ఆధ్వర్యంలో, ఏఎస్ఐ సుబ్బారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా శ్రీవీరాంజనేయస్వామి తిరుణాల


మహానందిపల్లెలో బండలాగుతున్న ఎద్దు

కలసపాడు : మండలంలోని మహానందిపల్లెలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని శ్రీవీరాంజనేయస్వామి తిరుణాల వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు కాశినాయన మండలం గొంటువారిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోవిళ్ళ రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను మహానందిపల్లె సర్పంచ్ దేవసాని శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.60,116లు, ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డికి చెందిన వృషభాలు రెండవ బహుమతి రూ.40,116లు, కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డికి చెందిన వృషభాలు మూడవ బహుమతి రూ.30,116లు, ప్రకాశం జిల్లా జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన మునుస్వామికి చెందిన రెండు జతల వృషభాలు నాల్గవ బహుమతి రూ.20,116లు, ఐదవ బహుమతి రూ.10,116లు గెలుపొందాయి. బహుమతులను ఆలయ నిర్వాహకులు అందజేశారు. రాష్ట్ర హంస అవార్డు గ్రహీత పుల్లయ్య ఆధ్వర్యంలో వేసిన కోలాటం భక్తులను అలరించింది. ఎస్ఐ నాగమురళి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన శిక్షణ


శిక్షణ పొందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లతో స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లాలోని స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్‌లకు నిర్వహించిన బేసిక్ అడ్వాన్స్‌డ్ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో విజయవంతంగా ముగిసిందని స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. కడప నగరం శంకరాపురంలోని స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో ఈ నెల 24 నుంచి ఏడు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణంలో బేసిక్ శిక్షణకు 75 మంది అడ్వాన్స్‌డ్స్ శిక్షణకు 23 మంది స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు హాజరయ్యారన్నారు. ఈ శిక్షణలో రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో ... పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి అంశాలలో శిక్షణ ఇవ్వాలనే అంశాల గురించి వివరించారన్నారు. వీటితోపాటు నైతిక విలువలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ లక్ష్మీకర, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఎల్‌ఓసీలు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్యరాముడి పట్టాభిషేకం

– ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు


పట్టాభిషేక క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై శ్రీ లక్ష్మణ అంజనేయ సమేత సీతారాముల ఉత్సవ మూర్తులను సర్వాలంకార భూషితులను చేసి కొలువు దీర్చారు. వేద పండితుల మంతోచ్చాటనల మధ్య దాదాపు రెండు గంటలపాటు ఈ క్రతువును నిర్వహించారు. అయోధ్యనగర ప్రముఖులంతా ఈ ఘట్టాన్ని తిలకించేందుకు ఆహ్వానంపై అతిథులుగా విచ్చేశారని, బంధుమిత్రులు, ఆత్మీయులు ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు హాజరయ్యేందుకు అర్చకులు చెబుతూ లోక కల్యాణం కోసం ఆయోధ్యకు శ్రీరామునికి చక్రవర్తిగా పట్టాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ నిర్వహించారు. భక్తులందరిపై పవిత్ర జలాలను ప్రోక్షణ చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రజలపై పన్నుల భారం తగ్గించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏప్రిల్ 1 నుంచి ప్రజలపై వేస్తున్న భారాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని సీపీఎం నగర రామ్మోహన్ డిమాండ్ చేశారు. పన్నుల భారాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నగరంలోని పాత బస్టాండు వద్ద నున్న జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ప్రజలు ఉపయోగించే ఔషధ ధరలను గతంలో ఉన్నదూ లేనివిధంగా 12 శాతం పెంచాలని చూస్తోందన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, డయాలసిస్ గుండె సంబంధిత 800 రకాల మందులు జాతీయ ఔషధ ధరల అధారిటీ పెంచేలా చర్యలు తీసుకుందన్నారు. ఇవే కాకుండా టోల్ చార్జీలు, సిమెంట్ ధరల పెంపు వల్ల ప్రజలకు కోలుకోలేని దెబ్బ తగులుతుందన్నారు.